




మహాజాతరకు ఆర్టీసీ రెడీ

- రేపటి నుంచి ప్రత్యేక సర్వీసులు
- 6వేల బస్సుల్లో 35లక్షల మంది భక్తుల తరలింపే లక్ష్యం
- మేడారంలో 55ఎకరాల్లో తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు

శివసత్తుల పూనకం..
నిలువెత్తు బంగారం..

- మేడారం వనదేవతలకు భక్తుల ముందస్తు మొక్కులు
- జాతర సమీపిస్తుండటంతో పెరుగుతున్న రద్దీ



సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద భక్తుల కోలాహలం, జంపన్న వాగులో పుణ్యస్నానం

మేడారం, ఫిబ్రవరి 16 : మేడారం మహాజాతర ఘట్టానికి సమయం సమీపిస్తోంది. ఇప్పటికే నెలరోజులుగా భక్తులు ముందస్తు దర్శనాలు చేసుకుని మొక్కులు చెల్లించుకుంటుడగా.. శివసత్తుల పూనకాలు, నిలువెత్తు బంగారంతో వస్తున్న భక్తులతో మేడారం పరిసరాలు సందడిగా మారుతున్నాయి. రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతుండగా శుక్రవారం లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు చెబుతున్నారు. శివసత్తుల పూనకాలు, భాజాభజంత్రీలు, డోలు సన్నాయి మేళాలు, సమ్మక్క సారలమ్మలకు జేజేలతో పరిసరాలన్నీ హోరెత్తుతున్నాయి. వనదేవతల మొక్కుల్లో భాగంగా భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కాలినడకన గద్దెలకు చేరుకుని.. పసుపు, కుంకుమ, చీర సారె సమర్పించి.. యాటమొక్కులు చెల్లించుకుంటున్నారు. నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పిస్తున్నారు. లక్షలాదిగా వస్తున్న భక్తులతో గద్దెల ప్రాంగణం, జంపన్నవాగు తీరం కిటకిటలాడుతుండగా.. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో మేడారమంతా జాతర సందడి కనిపిస్తోంది.

వనదేవతలను దర్శించుకున్న కేంద్ర మాజీ మంత్రి

మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మలను కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ కుటుంబ సమేతంగా తల్లులను దర్శించుకున్నారు. పూజారులు సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేశారు. పూలు పండ్లు, కొబ్బరికాయ, బెల్లం తల్లులకు సమర్పించారు. పూజారులు కండువాతో సన్మానించారు.

నేడు మేడారానికి నలుగురు మంత్రులు రాక

- ఏర్పాట్లను పరిశీలించిన ములుగు కలెక్టర్



మేడారం, ఫిబ్రవరి 16: మేడారం జాతరకు శనివారం నలుగురు మంత్రులు రానున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను శుక్రవారం ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. శనివారం మేడారంలో రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్ల గద్దెల ప్రాంగణం, మీడియా పాయింట్, హరిత హోటల్, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీపీవో వెంకయ్య, తహసీల్దార్ రవీందర్ తదితరులు ఉన్నారు.

రుణ ప్రణాళిక లక్ష్యాలను సాధించాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రుణ ప్రణాళిక లక్ష్యాలను అన్నిరంగాల్లో సాధించేందుకు సమన్వయంతో ముందుకుపోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.4,044 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన వార్షిక రుణప్రణాళికను ఆవిష్కరించారు. 2023-24 వార్షిక లక్ష్యాలను సమీక్షించగా.. రూ.3,222.79 కోట్లకు గాను రూ.2643.66 కోట్ల లక్ష్యాలను సాధించి 82.03 శాతంతో ఉన్నామని బ్యాంకు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అందులో పంటరుణాలు రూ. 1688.76 కోట్లకు గాను రూ.1108.77 కోట్ల లక్ష్యాలను సాధించి, 65.66 శాతంతో ఉన్నామన్నారు. అదే విధంగా మహిళా రుణాల్లోరూ.351.96 కోట్లకు గాను రూ.426.66 కోట్ల లక్ష్యాలను సాధించి, 103.35 శాతంతో ఉన్నామని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గోడౌన్ల కొరత ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు ఔత్సాహికులను ప్రోత్సాహించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే పోడు పట్టాలు అందజేసిన రైతులకు రుణాలు ఇవ్వాలని, బ్యాంక్ అధికారులకు సూచిస్తూ అందుకు సంబంధించిన వివరాలను గిరిజన సంక్షేమ అధికారులు త్వరితగతిన అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు పురుషోత్తం, సుధాకర్, సత్యనారాయణ, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, ఎండీ అలీబాబా, సత్యనారాయణమూర్తి, శ్రీధర్‌రెడ్డి, రాధిక పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో న్యూడెమోక్రసీ దళకమాండర్లు?

- రెండు రోజుల క్రితం సమావేశానికి వెళ్తుండగా తీసుకెళ్లినట్లు పార్టీ వర్గాల ప్రకటన
- వారిని వెంటనే కోర్టులో హాజరు పర్చాలని డిమాండ్
- బయ్యారం ఏజెన్సీని జల్లెడ పడుతున్న స్పెషల్ పార్టీ పోలీసులు



బయ్యారంలో రాస్తారో చేస్తున్న ఎన్డీ నేతలు

బయ్యారం, ఫిబ్రవరి 16 : సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అగ్రనేతలు ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. చంద్రన్న వర్గం తెలంగాణ కార్యదర్శి, దళ కమాండర్ అశోక్ అలియాస్ కుర్సం వజ్జయ్య, వరంగల్ జిల్లా కార్యదర్శి, దళ కమాండర్ గోపన్న అలియాస్ ధనసరి సమ్మయ్య పార్టీకి సంబంధించి ఓ సమావేశానికి వెళ్తుండగా, స్పెషల్ పార్టీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. పక్కా రహస్య సమాచారంతోనే రెండు రోజుల క్రితం ఇల్లందు-ఖమ్మం మార్గమధ్యలో వారిని పోలీసులు తీసుకెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. వీరితో పాటు బయ్యారం మండలం మిర్యాలపెంట గ్రామంలో జిల్లా నాయకుడు పుల్లన్నను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. రెండురోజులు క్రితం వీరిని అదుపులోకి తీసుకున్నట్టు పార్టీ వర్గాలు పేర్కొంటున్నా.. శుక్రవారం తెల్లవారుజామున నాయకులను పోలీసులు తీసుకెళ్లినట్లు విస్తృత ప్రచారం జరిగింది. ఈ క్రమంలో వారిని కోర్టుకు అప్పగించాలంటూ పార్టీ నేతలు ఐలయ్య, బిక్షం, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, పద్మ తదితరులు బయ్యారం, గంధంపల్లి గ్రామాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. మరోపక్క ఈ ఇరువురు అగ్రనేతలతో పాటు సదరు పార్టీ, అనుబంధసంఘాలకు చెందిన మరో 10మందిని జిల్లాల్లోని వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు అదుపులోకి తీసుకోవడం చర్చనీయంశంగా మారింది. మొత్తం న్యూ డెమోక్రసీ క్యాడర్‌ను ఒకటి, రెండు రోజుల్లో పోలీసుల ఉన్నతాధికారులు మీడియా ముందు ప్రవేశపెట్టి, వివరాలు వెల్లడించే అవకాశమున్నట్లు తెలిసింది. ఈ విషయ మై స్థానిక పోలీసులను సంప్రదించగా స్పష్టమైన సమాచారమేది ఇవ్వలేదు. ఇదిలా ఉండగా శుక్రవారం స్థానిక పోలీసులు కొంతమంది ఎన్డీ నేతలను అదుపులోకి తీసుకొని, విడిచిపెట్టినట్లు సమాచారం. వారి నుంచి పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన వివరాల రాబట్టినట్లు తెలిసింది.

బయ్యారం ఏజెన్సీలో కూంబింగ్!

ఎన్డీ దళకమాండర్లను స్పెషల్ పార్టీ పోలీసులు అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా బయ్యారం ఏజెన్సీలో పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. బయ్యారం, గంగారం మండలాల సరిహద్దు ఏజెన్సీ ప్రాంతాలైన మిర్యాలపెంట, పందెం, కొడితెల మిట్ట అటవీ ప్రాంతాలను స్పెషల్ పార్టీ పోలీసు బలగాలు జల్లెడ పడుతున్నట్టు సమాచారం. బయ్యారం ఏజెన్సీ ప్రాంతంలో ఎన్డీ నక్సల్స్ స్థావరం ఏర్పాటు చేసుకున్నట్లు అందిన సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు బలగాలు అటవీ ప్రాంతాన్ని గాలిస్తున్నట్లు తెలిసింది. కాగా, పోలీసు బలగాల కూంబింగ్‌తో ఏజన్సీ ప్రాంత గిరిజనులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు, ఎక్కడా ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని గిరిజనం బిక్కుబిక్కు మంటున్నారు. చాలాకాలం తరువాత బయ్యారం ఏజన్సీ ప్రాంతంలో మళ్లీ నక్సల్స్ అలజడి నెలకొనడం, పోలీసులు కూంబింగ్ నిర్వహించడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా సిరిసిల్ల రాజయ్య



సిరిసిల్ల రాజయ్య

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి16 : తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సిరిసిల్ల రాజయ్య నియమితులయ్యారు. చైర్మన్‌తో పాటు ముగ్గురు సభ్యులతో కూడిన కమిషన్‌ను రాష్ట్ర గవర్నర్ డాక్టరు తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. స్టేట్ ఫైనాన్స్ కమిషన్‌గా సిరిసిల్ల రాజయ్య నియమితులు కావడం పట్ల ఆయన సన్నిహితులు, పార్టీ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. చైర్మన్ రాజయ్యతో పాటు ప్రకటించిన ముగ్గురు సభ్యుల్లో మహబుబాబాద్‌కు చెందిన మాలోతు నెహ్రూనాయక్ ఉన్నారు. మిగతా ఇద్దరిలో వికారాబాద్‌కు చెందిన మల్యాడ్ రమేశ్, సూర్యాపేటకు చెందిన సంకెపల్లి సుధీర్‌రెడ్డికి చోటు దక్కింది.

పార్లమెంట్ ఆశావహుల రేసు నుంచి పక్కకు

సిరిసిల్ల రాజయ్యకు ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడంతో ఇక ఆయనకు వరంగల్ పార్లమెంట్ టికెట్ తలుపులు మూసివేసినట్లే అయ్యింది. వరంగల్ పార్లమెంట్ ఆశావహుల్లో ముఖ్యులుగా సిరిసిల్ల రాజయ్య ఉన్నారు. గతంలో ఆయన ఎంపీగా పని చేయడం, టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి పగ్గాలు చేపట్టకు ముందు నుంచే ఆయనకు మద్దతుదారుడిగా ఉండడంతో రేవంత్‌రెడ్డికి కూడా రాజయ్యకు పదవి కల్పన బాధ్యతగా పరిణమించింది. వరంగల్ పార్లమెంట్ టికెట్ రేసులో పోటీ అధికంగా ఉండడం, టికెట్ కేటాయింపు భారమైన తరుణంలో రాజయ్యకు సముచిత స్థానం కల్పించాలనే నిర్ణయంతో రేవంత్‌రెడ్డి స్టేట్ కమిషన్ చైర్మన్‌గా నియమించారనే అంచనాలు జిల్లా పార్టీ వర్గాల్లో నెలకొన్నాయి. రాజయ్యకునామినేటెడ్ పోస్టు దక్కడంతో పార్లమెంట్ టికెట్ రేసు నుంచి ఒకరు తప్పినట్లైయ్యింది. దీంతో మిగతా ఆశావహులు కూడికలు, తీసివేతల్లో తలమునకలయ్యారు.

కమిషన్ సభ్యుడిగా.. మాలోతు నెహ్రూనాయక్



కురవి : తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా మాలోతు నెహ్రూనాయక్ నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. సిరిసిల్ల రాజయ్య చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలోని ముగ్గురు సభ్యుల్లో మాలోతు నెహ్రూనాయక్‌కు చోటు లభించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో డోర్నకల్ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసిన నెహ్రూనాయక్ టికెట్ రాకపోయినప్పటికి కాంగ్రెస్ అభ్యర్థి జాటోతు రాంచంద్రునాయక్ గెలుపు కోసం కృషి చేశారు. ప్రస్తుతం మహబూబాబాద్ ఎంపీ స్థానాన్ని ఆశిస్తున్నారు. కురవి మండలం లింగ్యాతండాకు చెందిన నెహ్రూనాయక్‌కు రాష్ట్రస్థాయి పదవీరావడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తూతూ మంత్రంగా జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం



స్థాయీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ బిందు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి16 : జిల్లా ప్రజాపరిషత్ సాయీసంఘాల సమావేశం శుక్రవారం మొక్కుబడిగా జరిగింది. ప్రజాప్రతినిధులు లేకుండానే తూతూ మంత్రంగా సాగింది. ఈ సమావేశానికి హాజరు కానీ అధికారులకు నోటీసులు జారీ చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ అంగోతు బిందు జడ్పీ సీఈవో రమాదేవిని ఆదేశించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ వేసవి కాలం ఆరంభమైందని, ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గానికి రాష్ట్రప్రభుత్వం కోటి రూపాయలను మంజూరు చేసిందని, అందులో రూ.50 లక్షలను తాగునీటి అవసరాల కోసం ఖర్చు చేయాలన్నారు. వచ్చే మార్చిలో పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ అధికారిని సూచించారు. అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీలు, సబ్‌సెంటర్, పల్లె దవఖానాల్లో వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చూడాలని డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీషను ఆదేశించారు. నెల్లికుదురు జడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త ఇంటినెంబర్లు ఇవ్వడంలేదని, దాంతో గృహ వినియోగదారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించాలని డీపీవో హరిప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. జడ్పీకోఆప్షన్ సభ్యుడు ఖాసీం మాట్లాడుతూఎన్‌హెచ్365 రహదారి అసంపూర్తిగా నిర్మాణం చేసి వదిలేశారని, గూడూరు మండలం భూపతిపేట మధ్య బ్రిడ్జి పనులను మధ్యలోనే నిలిపివేసి వెళ్లారని, ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలని సభా దృష్టికి తీసుకువచ్చారు. జడ్పీ సీఈవో రమాదేవి, డిప్యూటీ సీఈవో నర్మద, జడ్పీటీసీలు బండి వెంకట్‌రెడ్డి, ఎం. శ్రీనివాస్, ఝాన్సీలక్ష్మి, జడ్పీ కోఆప్షన్ మహబూబ్‌పాషా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు మానుకోటకు హైకోర్టు జడ్జీల రాక

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి16 : జిల్లా కోర్టుకు శనివారం హైకోర్టు జడ్జీలు శ్రీనివాసరావు, ఎన్.రాజేశ్వర్‌రావు రానున్నారు. ఉదయం 7గంటలకు కురవి శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. 8 గంటలకు అనంతాద్రిలోని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. 10.30 గంటలకు మానుకోటలోఆధునీకరించిన సీనియర్ సివిల్‌జడ్జీ కోర్టును ప్రారంభిస్తారు. 11 నుంచి 12గంటల మధ్య జ్యూడిషియల్ అండ్ ప్రభుత్వ అధికారులతో సమావేశంలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల వరకు న్యాయవాదులతో సమావేశం, 2.30 గంటలకు న్యాయమూర్తులతో సమావేశం నిర్వహించనున్నారు. తిరిగి సాయంత్రం మహబూబాబాద్ నుంచి వారు హైదరాబాద్‌కు బయలు దేరి వెళ్లనున్నారు.

4న మునిసిపల్ వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం 6లో..

భారత్ బంద్ విజయవంతం

- మానుకోటలో తెరుచుకోని వ్యాపార సముదాయాలు
- మండల కేంద్రాల్లో వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ ర్యాలీలు
- మతోన్మాద బీజేపీని గద్దె దించే వరకు పోరాడాలి
- వామపక్ష నాయకులు, కార్మిక సంఘాల నేతల పిలుపు




మానుకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 16 : కేంద్రప్రభుత్వం అవలం బిస్తున్న కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేకవిధానాలను నిరసిస్తూ వామపక్ష పార్టీల అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా దేశవ్యాప్త సమ్మె, బంద్ నిర్వహించారు. మానుకోట జిల్లా కేంద్రంలో వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు, బీఆర్ఎస్‌కేవీల ఆధ్వర్యంలో బంద్ చేపట్టారు. వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు ముందస్తుగా బంద్ చేశారు. బైక్‌లపై తిరుగుతూ అక్కడక్కడ తెరిచి ఉన్న షాపులను మూసి వేయించారు. అనంతరం స్థానిక వ్యవసాయ మార్కెట్ నుంచి తహసీల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వామపక్షపార్టీల కార్మిక సంఘాల నాయకులు బి.అజయ్‌సారథిరెడ్డి, బి.మధు, హలావత్ లింగ్యానాయక్, కొత్తపల్లి రవి, గుజ్జు దేవేందర్, మంగలంపల్లి రాజ్‌కుమార్ మాట్లాడారు. బీజేపీ పాలకుల నుంచి దేశాన్ని రక్షించుకునేందుకు ప్రజలంతా ఒక్కతాటిపైకి రావాలని కోరారు. వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు బి.విజయసారథి, సాదుల శ్రీనివాస్, చిన్నచంద్రన్న, బండారి ఐలయ్య, ఆకుల రాజు, కుంట ఉపేందర్, రేషపల్లి నవీన్, గునిగంటి రాజన్న, చింతకుంట్ల వెంకన్న, కోటేష్, బాలమల్లు, శెట్టివెంకన్న, తోట వెంకటేశ్వర్లు, ఎస్కే. బాబన్న, జగ్గన్న, పెరుగుకుమార్, పాండురంగాచారి, రవి, శ్రావణ్, లింగ్యా, నాగన్న, బిందు, అశ్వినీ, జ్యోతి, రజిత, అశోక్, ప్రవీణ్ పాల్గొన్నారు.

- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. తెరిచి ఉన్న షాపులను మూసి వేయించారు. కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు నీరుటి లక్ష్మీనారాయణ, ఖలీల్‌పాషా, మిట్టకంటి రాంరెడ్డి, బానోత్ ప్రసాద్, ఎడ్ల రమేష్, నిమ్మల శ్రీను, గుగులోతు వెంకట్, వీరభద్రం, బెల్లంకొండ శ్రీనివాస్, శంతన్‌రామారాజు, బోడ రవినాయక్, వెంకన్న, నవీన్‌కుమార్, నాసర్,

మిగతా 6వ పేజీలో









భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

వరంగల్ లీగల్, ఫిబ్రవరి 16 : వివాహేతర సంబంధం ఉన్నదనే అనుమానంతో భార్యను వేధింపులకు గురి చేసి హత్యకు పాల్పడిన ఎమ్డీ అయూబ్ ఖాన్ అనే కానిస్టేబుల్‌కు యావజ్జీవ కారాగార శిక్షా , రూ. 10 వేలు జరిమానా విధి స్తూ వరంగల్ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి కోకా రాధాదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివ రాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా కేంద్రం అశోక్ నగర్‌కు చెందిన తస్మీన్ సుల్తా నాను వరంగల్ జిల్లా పెన్షన్‌పుర గ్రామానికి చెందిన ఎమ్డీ అయూబ్ ఖాన్‌కు ఇచ్చి 2006 సంవ త్సరంలో వివాహం జరిపించారు. ప్రస్తుతం ఆయూబ్ ఖాన్ రఘునాథపెల్లి పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తు న్నాడు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, 2019 నుంచి భార్య ప్రవర్తనను అనుమానిస్తూ వివా హేతర సంబంధం కొనసాగిస్తుందన్న నేపంతో శారీరకంగా, మానసికంగా వేధిస్తుం డేవాడు. ఎన్నిసార్లు అత్తింటివారు సర్ధి చెప్పినా నిందితు డిలో మార్పు రాలేదు. ఈ క్రమంలో 2020 జూన్ 5న తస్మీన్ సుల్తానా తన అన్న సాదిక్ హుస్సేన్‌కు ఫోన్‌చేసి ఎప్పటిలాగా తనను అను మానిస్తూ వేధిస్తున్నాడని చెప్పింది. తన తల్లిద ండ్రులను అదే రోజు చెల్లెల్లి అత్తగారింటికి పంపించి మరునాడు జూన్ 6న సాయంత్రం సాదిక్ హుస్సేన్ చెల్లెలి ఇంటికి వెళ్లాడు. అక్కడే ఉన్న తల్లిదండ్రులతో విషయం తెలుసుకోగా తస్మీన్ సుల్తానాను నిందితుడు బయటకు తీసుకెళ్లా డని తెలిపారు.విషయంపై విచారిం చగా మామునూరు క్యాంపులోని పాత క్వార్టర్స్‌లో తన చెల్లె కనిపించిందని మొఖంపై గాయాలతో, గొంతు బిగించి మృతి చెంది ఉంది. దీంతో తన చెల్లెలు తస్మీన్ సుల్తాన్‌ను నింది తుడు అనుమా నంతో చంపాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీరించిన మాము నూరు పోలీసులు నిందితుడిపై హత్యానేరం నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున ఎమ్డీ అయుబ్‌ఖాన్‌కు జీవిత ఖైదు, రూ . 10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ అజ్మీరా సాంబూ నాయక్ సాక్షులను ప్రవేశ పెట్టగా లైజనింగ్ అధికారిగా ఎం. వెంకటస్వామి, దర్యాప్తు అధికారిగా అప్పటి సీఐ సార్ల రాజు వ్యవహ రించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కేసు వాదించారు.

ఎంజీఎంలో అనుమానాస్పద వ్యక్తులు..
దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 16: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో కలకలం రేగింది. గురువారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు ఎంజీఎం ఆస్పత్రిలోని పిల్లల వార్డుకు చేరుకున్నారు. మా అమ్మాయి కనిపించడం లేదంటూ వార్డులోని ఎన్ఐసీయూకు వెళ్లారు. అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సెక్యూరిటీ గార్డులు అక్కడకు చేరుకొని వారిని ఆస్పత్రికి బయటకు పంపించారు. కాగా,, రాత్రి 11 గంటల ప్రాంతంలో మరోసారి పిల్లల వార్డు ముందు తిరుగు తూ కనిపించారు. దీంతో అనుమానం వచ్చిన స్థానికులు వారిని చితకబాది పోలీసులకు అప్పగించారు. ఆడ, మగ వ్యక్తులు అనుమానాస్పదంగా ఎంజీఎంలో పిల్లల వార్డు సమీపం లో తిరుగుతున్నారని పోలీసులు చెప్పారు. పూర్తి వివరాలు రాబడుతున్నట్లు మట్టెవాడ పోలీసులు తెలిపారు.

భూపాలపల్లిలో పిల్లలను ఎత్తుకెళ్లేందుకు వచ్చాడని...

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఫిబ్రవరి 16: పిల్లలను ఎత్తుకెళ్లే వారు సంచరిస్తున్నారనే వందతులు వ్యాపించిన నేపథ్యంలో ఓ వ్యక్తిని కాలనీవాసులు పట్టుకొని తాళ్లతో కట్టి చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన భూపాలపల్లి పట్టణంలోని ఎల్‌బీనగర్‌లో చోటుచేసుకుంది. కాలనీలో ఇద్దరు వ్యక్తులు శుక్రవారం తెల్లవారు జామున సంచరిస్తుండగా స్థానికుడు ఒకరు గమనించాడు. వెంటనే చుట్టుపక్కల వారిని పిలిచి విషయం చెప్పాడు. దీంతో అప్రమత్తమైన కాలనీవాసులు ఆ ఇద్దరు వ్యక్తులను పట్టుకునేందుకు యత్నించారు. వీరిలో ఒకరు ద్విచక్రవానంపై పరారు కాగా మరొకరు కాలనీవాసులకు పట్టుబడ్డాడు. దీంతో అతడిని తాళ్లతో కట్టేసి పోలీసులకు అప్పగించారు. ఆ వ్యక్తి వరంగల్‌కు చెందిన వాడని తమ విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. అతడి పేరు రాజు అని, తాను పందులు పట్టేందుకే వచ్చానని తమకు చెప్పాడని పేర్కొన్నారు.

దూరవిద్య డిగ్రీ, పీజీ కోర్సుల ఫీజు చెల్లింపు గడువు 15

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 16 : కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న డిగ్రీ కోర్సుల ద్వితీయ, తృతీయ సంవత్సరంతో పాటు పీజీ రెండోవ ఏడాది పరీక్ష ఫీజులను మార్చి 15 వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం,(జనరల్, కంప్యూటర్) బీబీఏ, బీఎస్సీతో పాటు పీజీ రెండోవ ఏడాది కోర్సుల విద్యార్థుల తమ పరీక్షల ఫలితాల కోసం వేచిచూడకుండా కోర్సుల ఫీజులు చెల్లించుకుని స్టడీ మెటీరియల్ పొందాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 0870-2461480, 2461490లో సంప్రదించాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు. ఇదిలా ఉండగా దూరవిద్య కేంద్రం అందిస్తున్న ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ మొదటి ఏడాది పూర్తైన అభ్యర్థులందరూ రెండో ఏడాదికి కోర్సు ఫీజులను ఎలాంటి అపరాధ రుసుం లేకండా మార్చి 15 వరకు చెల్లించుకోవాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వెల్లడించారు.

లంసం, క్యాజువల్
ఉద్యోగులకు న్యాయం చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి



సమ్మెలో ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 16 : కేయూలో పనిచేస్తున్న లంసం, క్యాజువల్ ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలో అప్‌గ్రేడ్ చేసి న్యాయం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా శుక్రవారం జరిగిన ఉద్యోగుల సార్వత్రిక సమ్మెను పురస్కరించుకుని సీఐటీయూ ఆధ్వర్యంలో కేయూ పరిపాలన భవనం ఎదుట నిరసన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కచ్చకాయల చిరంజీవి ఆందోళనలో పాల్గొని మాట్లాడారు. కేయూలో తాత్కాలిక ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలోకి అప్‌గ్రేడ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని అన్నారు. అనంతరం కేయూ సీఐటీయూ నాయకులు కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్‌ను కలిసి వర్సిటీ ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రాన్ని అందచేశారు. సానుకూలంగా స్పందించి 4 రోజుల్లో ఉద్యోగులతో భేటీ నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు ఆకుతోట రాంచందర్, కార్యదర్శి దేశిని రవికుమార్, ఉపాధ్యక్షుడు పల్లం రాజు, మధు, ట్రెజరర్ ఎం.రాజేందర్, సందీప్, కృష్ణ, శోభ. లక్ష్మి, రాణి, సరోజన తదితరులు పాల్గొన్నారు.









కేంద్రం నుంచి రూ.3కోట్లు

మేడారం జాతరకు కేటాయిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరంగల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడారం మహాజాతరపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించింది. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో 'మేడారం జాతరకు కేంద్రం మొండి చేయి.. తెలంగాణ కుంభమేళాకు పైసా ఇవ్వని మోదీ సర్కార్' అనే కథనానికి కేంద్ర ప్రభుత్వం స్పందించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ మేరకు ప్రకటన చేశారు. మేడారం మహాజాతరకు కేంద్ర ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిధులతో మహాజాతరలో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు వెచ్చించనున్నట్లు వెల్లడించారు. కాగా, 2020 జాతరకు కేంద్ర ప్రభుత్వం రూ.6.10 కోట్లు ఇవ్వగా, 2022 జాతరకు రూ.2.50 కోట్లు మాత్రమే ఇచ్చింది. తాజాగా కిషన్‌రెడ్డి రూ.3 కోట్లు ఇస్తామని ప్రకటించటంతో భక్తుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం జాతర జరగనుంది. ఇందు కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.110 కోట్లు కేటాయించింది.

మేడారానికి ప్రత్యేక రైళ్లు

21నుంచి నడపనున్నట్లు రైల్వే శాఖ వెల్లడి

గిర్మాజీపేట (వరంగల్), ఫిబ్రవరి 16 : ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు దక్షిణమధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడపనుంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది భక్తులు హాజరయ్యే ఈ జాతరకు సికింద్రాబాద్, నిజామాబాద్‌ల నుంచి వరంగల్ వరకు ప్రత్యేక రైళ్లు నడుస్తాయని దక్షిణమధ్య రైల్వే శుక్రవారం రాత్రి ప్రకటించింది.

సికింద్రాబాద్ నుంచి..

మేడారం మహాజాతర ప్రత్యేక రైలు సికింద్రాబాద్‌లో ప్రతి రోజు ఉదయం 9.52 గంటలకు బయలుదేరి కాజీపేటకు మధ్యాహ్నం 12.12 గంటలకు, వరంగల్‌కు ఒంటిగంటకు చేరుకుంటుంది. తిరిగి అదే మధ్యాహ్నం 1.55 గంటలకు వరంగల్‌లో బయలుదేరి కాజీపేట మీదుగా సాయంత్రం 6.20 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక మేడారం రైలు మౌలాలి, చర్లపల్లి, ఘట్‌కేసర్, బీబీనగర్, భువనగిరి, యాదగిరి, వంగపల్లి, ఆలేరు, పెంబర్తి, జనగామ, రఘునాథపల్లి, స్టేషన్ ఘన్‌పూర్, పెండ్యాల్, కాజీపేటలో ఆగుతుంది. ఈ నెల 21 నుంచి 25 వరకు ప్రతి రోజు ఈ ప్రత్యేక రైలు సికింద్రాబాద్-వరంగల్ మధ్య నడుస్తుంది.

నిజామాబాద్ నుంచి..

నిజామాబాద్ నుంచి మేడారం ప్రత్యేక రైలు ఈ నెల 21 నుంచి 24 వరకు సికింద్రాబాద్ మీదుగా కాజీపేట, వరంగల్ వరకు నడుస్తుంది. ఈ నాలుగు రోజుల్లో మేడారం ప్రత్యేక రైలు ప్రతీ రోజు ఉదయం 7.05 గంటలకు నిజామాబాద్‌లో బయలుదేరి సికింద్రాబాద్‌కు 11 గంటలకు చేరుకుంటుంది. సికింద్రాబాద్ నుంచి ఉదయం 11.10 గంటలకు బయలుదేరి కాజీపేటకు మధ్యాహ్నం 1.15 గంటలకు, వరంగల్‌కు 1.45 గంటలకు చేరుకుంటుంది. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు వరంగల్‌లో బయలుదేరి 3.15కు కాజీపేటకు చేరుకుంటుంది. కాజీపేట నుంచి మధ్యాహ్నం 3.20 గంటలకు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు జనగామ, సాయంత్రం 5.30 గంటకు సికింద్రాబాద్‌కు, రాత్రి 10.30 గంటలకు నిజామాబాద్‌కు చేరుకుంటుంది. నిజామాబాద్ నుంచి వరంగల్‌కు నడిచే ఈ ప్రత్యేక రైలు కామారెడ్డి, అకన్నపేట, మిర్జాపల్లి, వాదిరాం, మనోహరాబాద్, మేడ్చల్, బొల్లారం, మల్కాజిగిరి, సికింద్రాబాద్, చర్లపల్లి, ఘట్‌కేసర్, బీబీనగర్, భువనగిరి, వంగపల్లి, ఆలేరు, జనగామ, రఘునాథపల్లి, స్టేషన్ ఘనపూర్, పెండ్యాల్, కాజీపేట స్టేషన్‌లలో ఆగుతుంది. ఈ ప్రత్యేక రైళ్ల ద్వారా వచ్చే భక్తులు కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్‌ల వద్ద ఏర్పాటు చేసిన మేడారం బస్‌స్టేషన్‌ల నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా మేడారం వెళ్లేందుకు జిల్లా అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు



కమాండ్ కంట్రోల్ ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మేడారం, ఫిబ్రవరి 16: మహాజాతరలో భక్తుల సౌకర్యార్థం మేడారంలో పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. పోలీస్ కమాండ్ కంట్రోల్‌లో దీనిని ఏర్పాటు చేయగా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ప్రారంభించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా టోల్ ఫ్రీ నంబరు 18004250620 అందుబాటులో ఉంటుందని క తెలిపారు. జాతర పరిసరాల్లో మొత్తం 382 సీసీ కెమారాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని అన్నారు. భక్తుల భద్రతా దృష్ట్యా జాతరలో ఎనిమిది జోన్లుగా 42 సెక్టార్లుగా విభజించి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్, జిల్లా ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ పాల్గొన్నారు.

మహాజాతరకు ఆర్టీసీ రెడీ

రేపటి నుంచి ప్రత్యేక బస్సులు - 6వేల బస్సుల్లో 35 లక్షల మంది భక్తుల తరలింపే లక్ష్యం - మేడారంలో 55ఎకరాల్లో తాత్కాలిక బస్‌స్టేషన్ ఏర్పాటు



మేడారంలో భక్తుల కోసం సిద్ధంగా ఉన్న తాత్కాలిక బస్టాండ్

సుబేదారి, ఫిబ్రవరి 16 : మేడారం మహాజాతరకు భక్తులను తరలించేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి ఆరు వేల బస్సుల ద్వారా 35లక్షల మంది భక్తులను తల్లుల చెంతకు చేర్చాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే జాతర రోజుల్లో భక్తుల రద్దీకి తగ్గట్టుగా బస్సుల సంఖ్య పెంచుతూ అదాయాన్ని పెంచుకునే దిశగా ఆర్టీసీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇక ఆదివారం నుంచి మేడారానికి బస్సు సర్వీసులను ప్రారంభించనున్న అధికారులు మేడారంలో 55 ఎకరాల్లో తాత్కాలికంగా ఆర్టీసీ ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ జిల్లాలు, ప్రాంతాల వారీగా క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. అలాగే బస్సుల మరమ్మతులకు షెడ్లు, ఆర్టీసీ సిబ్బంది, కార్మికులు, అధికారులకు వసతి షెడ్లు, తాగునీటి, మరుగుదొడ్లు, ప్రయాణికుల కోసం విశ్రాంతి షెడ్లను నిర్మించారు. ఆర్టీసీ ఉద్యోగుల కోసం అత్యవసర వైద్య సేవలను అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గద్దెల వరకు భక్తులను చేర్చేలా ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. బస్సుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు భక్తులకు తెలియజేసేందుకు భారీ ఎల్‌ఈడీ స్ర్కీన్లను జాతరలోని ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్‌శాఖకు అనుసంధానం చేస్తున్నారు. జాతర కోసం 6 వేల ఆర్టీసీ బస్సులను సిద్ధం చేయగా వాటిలో వరంగల్ రీజియన్ నుంచే సుమారు 2500 బస్సులను నడపనున్నారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి కూడా బస్సులను నడిపించేందకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొత్తం 12,300 మంది ఆర్టీసీ సిబ్బంది విధుల్లో ఉండనుండగా మరో 500 మంది అధికారులు సేవలను పర్యవేక్షించనున్నారు.

ఫ్రీ టిక్కెట్‌తో పెరగనున్న మహిళా భక్తుల సంఖ్య

నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. ఈ క్రమంలోనే ఈసారి మేడారం వెళ్లే మహిళా భక్తులకు కూడా ఉచిత ప్రయాణ అవకాశం ఇస్తున్నట్టు ప్రకటించడంతో జాతరకు మహిళల సంఖ్య అధికంగా ఉండే అవకాశం ఉంది. దీంతో ఆర్టీసీకి మహిళా ప్రయాణికుల ద్వారా లాభం చేకూరుతుందని అంచనా వేస్తున్నారు.

భక్తులకు ఆర్టీసీ సేవలు విస్తృతం

జాతరకు వచ్చే భక్తులు ఎక్కువమంది ఆర్టీసీ బస్సులో ప్రయాణించేందుకే ఆసక్తి చూపుతున్నారు. ప్రతీజాతరకు ఆర్టీసీ తన సేవలను విస్తృతం చేస్తోంది. 1996లో మేడారం జాతరను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించినప్పటి నుంచి ఆర్టీసీ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. అయితే ప్రధానంగా 2008 నుంచి ఆర్టీసీ సేవలు విస్తృతమయ్యాయి. 2008లో 2,688 బస్సులను నడిపి 12 లక్షల మంది భక్తులను ఆర్టీసీ చేరవేసింది. 2010లో 3వేల బస్సుల ద్వారా 14లక్షల మందిని, 2012లో 3,100 బస్సుల ద్వారా 14లక్షల మంది భక్తులను తమ గమ్య స్థానాలకు ఆర్టీసీ చేరవేసింది. ఇక 2014లో 3,160 బస్సుల ద్వారా 14లక్షల మంది భక్తులను, 2016లో 3,382 బస్సుల ద్వారా 14లక్షల మంది భక్తులను ఆర్టీసీ చేరవేసింది. ఇక గత 2018 మహజాతరలో 4వేల బస్సులతో 18లక్షల మంది భక్తులను తరలించారు. అయితే 2018లో రాష్ట్ర వ్యాప్తగా 3,565 బస్సులతో 41వేల ట్రిప్పుల ద్వారా 18లక్షల మందిని తరలించగా, 2020 మహాజాతరలో 3,860 బస్సుల ద్వారా 45వేల ట్రిప్పులను నడిపి 19లక్షల మంది భక్తులను గమ్య స్థానాలకు చేర్చారు. 2022 జాతరలో 3,845 బస్సుల ద్వారా 21లక్షల మంది భక్తులను జాతరకు తరలించారు. ప్రస్తుతం 6వేల బస్సుల ద్వారా భక్తులను జారతకు చేర్చేందుకు ఆర్టీసీ సిద్ధమయింది. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా 100కు పైగా బస్సు పాయింట్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది.

భక్తులు సహకరించాలి

జె.శ్రీలత, ఆర్టీసీ ఆర్ఎం, వరంగల్ రీజియన్



మేడారంకు వచ్చే భక్తులు ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలి. గత జాతర కంటే అధికంగా భక్తులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులు ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షితంగా ప్రయాణించాలి. ఈ నెల 18 నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచితంగా బస్సుసౌకర్యం కల్పించడంతో ఈ సారి ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

గత జాతరల్లో భక్తులకు అందించిన సేవలు

ఏడాది	బస్సులు	ప్రయాణికులు
2008	2,688	12లక్షలు
2010	3,000	14లక్షలు
2012	3,100	14లక్షలు
2014	3,160	14లక్షలు
2016	3,382	14లక్షలు
2018	3,565	18లక్షలు
2020	3,860	19లక్షలు
2022	3,845	21లక్షలు

జాతరపై సాంకేతిక పర్యవేక్షణ

ట్రాఫిక్, భక్తుల రద్దీ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు

సాఫ్ట్‌వేర్ వినియోగం, సీసీ కెమెరాల ఏర్పాటు

వివిధ ప్రాంతాల సమాచారంతో ప్రత్యేక యాప్ రూపకల్పన

భూపాలపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : గిరిజన కుంభమేళాగా గుర్తింపు పొందిన మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో అత్యంత ముఖ్యమైన ట్రాఫిక్, భక్తుల రద్దీ నియంత్రణ, పోలీసు నిఘాపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ అంశాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సాంకేతికతను వినియోగిస్తోంది. ప్రధానంగా రద్దీ నియంత్రణ కోసం జాతరలో ఎంపిక చేసిన కీలక ప్రాంతాల్లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో కూడిన కెమెరాలను ఏర్పాటు చేసి.. వీటిని కంట్రోల్ రూంకు అనుసంధానించి వీటి ద్వారా చదరపు మీటరులో నలుగురికంటే ఎక్కువ మంది గుమిగూడిన ప్రాంతాలను గుర్తించి, రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టనున్నారు. అలాగే భక్తుల సంఖ్యను లెక్కించే క్రౌడ్ కౌటింగ్ కెమెరాలు, వాహనాల సంఖ్యను అంచనా వేసేందుకు నెంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. మేడారం క్షేత్రంలోని ప్రధాన మార్గాలు, కూడళ్లు, గద్దెల ప్రాంగణం, పార్కింగ్ స్థలాల్లో మొత్తం 500కు పైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. కంట్రోల్ రూంకు అనుసంధానమై ఉండే వీటి ద్వారా 24గంటల నిఘా ఉండేలా చూస్తారు. నిఘాను మరింత పటిష్ఠం చేసేందుకు గాను డ్రోన్ కెమెరాలను కూడా వినియోగించనున్నారు. ఇక వీటి నిర్వహణకు నిపుణలైన సిబ్బంది సహకారం తీసుకుని.. ఆయా ప్రాంతాలపై దృష్టి పెట్టనున్నారు.

జాతర వివరాల ప్రత్యక్ష ప్రసారానికి ఎల్ఈడీ తెరలు

మేడారంలోని పలు ప్రాంతాల్లో ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేసి జాతర వివరాలు, విశేషాలు, తప్పిపోయిన వారి వివరాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. వాహనాల పార్కింగ్ కోసం 1400 ఎకరాల మేర విస్తరించి ఉన్న 33 పార్కింగ్ స్థలాలను అందుబాటులోకి తేనుండగా.. భక్తుల కోసం ఆర్టీసీ ఆరు వేల బస్సులను నడపాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అటంకాలు లేకుండా నియంత్రణ పకడ్బందీగా జరిగేలా ఇప్పటికే వలంటీర్లు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.



అధికారులు అంకితభావంతో పనిచేయాలి

ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్

మేడారం, ఫిబ్రవరి 16: మేడారం జాతరలో విధులు నిర్వర్తిస్తున్నమన అధికారులు అంకితభావంతో పనిచేయాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్ అన్నారు. మరో నాలుగు రోజుల్లో మహాజాతర ప్రారంభంకానున్న నేపథ్యంలో సెక్టోరియల్ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. మేడారంలోని గిరిజన బాలిక ఇంగ్లిష్ ఆశ్రమ పాఠశాలలో సెక్టోరియల్ అధికారులకు నిర్వహిస్తున్న రెండో విడత శిక్షణ కార్యక్రమంలో పీవో మాట్లాడారు. మహాజాతర విధుల్లో పాల్గొనే అధికారులు ఈనెల 19న రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిబద్ధతతో పనిచేసి మహాజాతరను విజయవంతం చేయాలన్నారు. జంపన్నవాగు వద్ద విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం ఏమరపాటుగా ఉండొద్దని అన్నారు. జాతర పరిసరాల్లో ఆర్అండ్‌బీ అధికారులు సూచిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. జన సమూహంలో నిరంతరంగా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు.

పరిసరాల్లో దుర్వాసన రాకుండా ఎప్పటికప్పుడు రసాయనాలతో శుభ్రం చేస్తుండాలన్నారు. భక్తుల ఆరోగ్యాన్ని కాపాడాలని, అవసరమైతే తక్షణమే వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు సెక్టార్ల వారీగా సిబ్బందికి విధులు అప్పగించాలన్నారు. జాతరలో ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. పేపర్, క్లాత్, జూట్ బ్యాగులను మాత్రమే భక్తులు వినియోగించేలా చూడాలన్నారు. ప్లాస్టిక్ ఫ్రీ జాతరగా జరుపుకోవాలనే సందేశం ప్రతి ఒక్కరికీ తెలియాలని సూచించారు. గద్దెల వద్ద విధులు నిర్వహించే అధికారులు సమన్వయంగా పనిచేయాలన్నారు. భక్తుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకన్న, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, ఐటీడీఏ ఏపీవో వసంతరావు పాల్గొన్నారు.



సెక్టార్ అధికారులతో మాట్లాడుతున్న పీవో అంకిత్



మేడారంలోని తల్లుల గద్దెల వద్ద భక్తుల కోలాహలం



బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానాలచరిస్తున్న భక్తులు



బంగారాన్ని తల్లులకు సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు



జంపన్న వాగులో స్నానమాచరిస్తున్న భక్తులు

నేడు కేయూకు నిజనిర్ధారణ కమిటీ

వర్సిటీ అధికారులు, విద్యార్థులతో ముఖాముఖీ

కమిటీ రాకతో వర్సిటీలో సర్వత్రా ఉత్కంఠ

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 16 : కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అక్రమాలు జరిగాయంటూ విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో రాష్ట్ర ఉన్నతా విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వి.వెంకటరమణ నేతృత్వంలో త్రిసభ్య కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియామించింది. ఈ మేరకు శనివారం కాకతీయ యూనివర్సిటీకి త్రిసభ్య కమిటీపీహెచ్‌డీ అడ్మిషన్లపై నిజనిర్ధారణకు రానుంది. ఈ మేరకు వర్సిటీ ఉన్నతాధికారులకు నిజానిర్ధారణ కమిటీ పర్యటన వివరాలను లేఖలో వర్సిటీకి తమ పర్యటన షెడ్యూల్‌ను అధికారికంగా తెలియజేసింది.

ఫిబ్రవరి 17 ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల వరకు వీసీతో ప్రాథమిక చర్చలు, 11.15- 12.15 వరకు పీహెచ్‌డీ అడ్మిషన్ల సంబంధిత అధికారులతో చర్చలు, 12.30 నుంచి 1.15 వరకు, 2.15 3.30 రెండు దఫాలుగా విద్యార్థుల నుంచి పీహెచ్‌డీ-2 అడ్మిషన్లలో చోటుచేసుకున్న పరిణామాలు, విద్యార్థుల అభ్యంతరాలను వినతి పత్రాల ద్వారా నిజా నిర్ధారణ కమిటీ స్వీకరిస్తోంది. సాయంత్రం 3.45 గంటల నుంచి 4 గంటల వరకు నిజానిర్ధారణ కమిటీ సేకరించిన వివరాలను సమ్‌ఆఫ్ చేసి పర్యటన ముగిస్తారు. కాగా, కమిటీలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైర్మన్ ప్రొఫెసర్ వి. వెంకటరమణ పీహెచ్‌డీ నిజానిర్ధారణ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించగా ఆయనతో పాటు మరో ఓయూ జియాలజీ విభాగం ప్రొఫెసర్ పాండురంగారెడ్డి, టెక్నికల్ ఎడ్యుకేషన్ జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు రానున్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్లపై రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకుని వర్సిటీ చరిత్రలో మొదటి దఫా నిజానిర్ధారణ కమిటీ వేసి విచారణ జరిపించడం పట్ల సర్వత్రా చర్చనీయంగా మారింది. నిజానిర్ధారణ కమిటీ రిపోర్టు పీహెచ్‌డీ అడ్మిషన్ల లోగట్టును బట్టబయలు చేయనుందని వర్సిటీలో చర్చలు జోరందుకున్నాయి.

నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 16 : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం, మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెండు కార్యక్రమాల నిర్వహణకు సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ.. ఈ నెల 20న జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వరకు వయస్సున్న పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయడం జరుగుతుందన్నారు.

జిల్లాలో 2 లక్షల 33వేల 500 మంది పిల్లలకు ఈ మాత్రలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. మార్చి 3వ తేదీన జిల్లాలో 79వేల 227 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌వో వైవి.గణేష్, డీఈవో డాక్టర్ అబ్దుల్ హై, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్ మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యాకూబ్‌పాషా, డీఐఓ డాక్టర్ వాణిశ్రీ, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ హిమబిందు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

అజర ఆస్పత్రిలో పునరావాస కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న డాక్టర్ కాళీప్రసాద్

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 16 : హనుమకొండ ములుగురోడ్‌లోని అజర హాస్పిటల్‌లో ఫిజియోథెరపీ, పునరావాస కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఇకపై హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లకుండా ఇక్కడే అజర హాస్పిటల్‌లో తక్కువ ఖర్చుతో అత్యాధునిక వైద్యం పొందవచ్చని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బండారు శివసుబ్రమణ్యం తెలిపారు. అత్యాధునికమైన యూఎస్ ఇంపోర్టెడ్, ఎలక్ట్రో థెరపీ యూనిట్‌తో వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు దివ్వెల మోహన్‌దాస్, వలపదాసు చంద్రశేఖర్, పగడాల కాళీప్రసాద్, మాగంటి శేషుమాధవ్, కె.నాగార్జునరెడ్డి, ఎమ్డీ.అన్వర్, బి.శ్రీనివాస్, అప్పాల సుధాకర్, పెరుమాండ్ల రామకృష్ణ, వంశీ, హరీష్ పాల్గొన్నారు.

కమిషనరేట్ పరిధిలో సీఐల బదిలీలు

ఉత్తర్వులు జారీచేసిన సీపీ అంబర్ కిశోర్ ఝా

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 16: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐతే కొందరు ఒకే చోట ఎక్కువ కాలం పని చేయడం, మరి కొందరిపై కొన్ని ఆరోపణలు రావడంతో స్థానచలనం చేసినట్టు తెలుస్తోంది.

పోస్టింగ్ పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాలు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ ఐన ప్రదేశం
వై. సుధాకర్‌రెడ్డి	కమిషనరేట్	కాజీపేట
సీహెచ్ శ్రీధర్	కేయూసీ	వీఆర్ (వెకెన్సీ రిజర్వ్) వరంగల్
వి. చేరాలు	వీఆర్ (వెకెన్సీ రిజర్వ్)	వరంగల్ కేయూసీ
డి. రవిరాజు	వీఆర్ (వెకెన్సీ రిజర్వ్)	వరంగల్ పరకాల
ఎం. అబ్బయ్య	పరకాల	సీసీఎస్ వరంగల్




అయోధ్య ప్రత్యేక రైలును ప్రారంభిస్తున్న యాప సీతయ్య, కేసముద్రం రైల్వేస్టేషన్‌లో భక్తులు

అయోధ్యకు బయలు దేరిన భక్తులు

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 16 : ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య శ్రీరామమందిరాన్ని సందర్శనకు మహబూబాబాద్ నుంచి భక్తులు భారీగా శుక్రవారం తరలివెళ్లారు. అయోధ్య రామ మందిరం సందర్శనార్థం భక్తుల కోసం కేంద్రప్రభుత్వ దేవాదాయశాఖ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ భక్తుల కోసం భద్రాచలం నుంచి అయోధ్యకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేశారు. సదరు రైలు భద్రాచలం నుంచి మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌కు సాయంత్రం చేరుకోగా, స్థానిక బీజేపీ నేతలు స్వాగతించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గస భ్యులు యాప సీతయ్య పచ్చజెండా ఊపి రైలును పంపించారు. అయోధ్యలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన బాలరాముడి ఆలయాన్ని సందర్శించేందుకు కేంద్రప్రభుత్వ దేవాదాయశాఖ ప్రత్యేకంగా రైలును ఏర్పాటు చేసి భక్తులకు అవసరమైన వసతులు కల్పించి రాముడిని దర్శించుకునే భాగ్యం కల్పించడం అభినందనీయమని ఆయన అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ నుంచి మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల నుంచి 446 మంది భక్తులు అయోధ్యకు తరలిపోగా పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి సుమారు 1400 మంది అయోధ్యకు వెళ్లినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్లు, వద్దిరాజు రాంచందర్‌రావు, మోసంగి మురళీ, వీరప్ప, ముసుకు శ్రీనివాస్‌రెడ్డి, చుక్కల నరేష్, మారగాని రాజుగౌడ్, యశ్వంత్, ఇందుభారతి, జస్వంత్, రాముగౌడ్, శ్యాంసుందర్‌శర్మ, నర్సింహారెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

● కేసముద్రం : అయోధ్య రామమందిరాన్ని దర్శించుకునేందుకు కేసముద్రం మండలం కేసముద్రం స్టేషన్, ఉప్పరపల్లి, ధన్నసరి, వెంకటగిరి, కల్వల, కేసముద్రం విలేజి తదితర గ్రామాలకు చెందిన 48 మంది భక్తులు బయలుదేరారు. కేసముద్రం రైల్వేస్టేషన్‌లో అయోధ్య ప్రత్యేక రైలు ఆస్తా ఎక్స్‌ప్రెస్‌ద్వారా బయలు దేరారు. బీజేపీ సీనియర్ నాయకుడు వోలం శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు పొదిల నర్సింహారెడ్డి, బచ్చు లక్ష్మీనారాయణ, లెంకలపల్లి శ్రీనివాస్, అల్లం నిరంజన్, సింగంశెట్టి మధు, ఎనమనగండ్ల నవనీత్, పరకాల కుమార్, పొట్లబత్తిని రవి, రేణికుంట్ల శ్రీకర్ పాల్గొన్నారు.



సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో కౌంటింగ్ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

మహబూబాబాద్, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి) : వచ్చే పార్లమెంట్ ఎన్నికల కోసం కౌంటింగ్ కేంద్రాలను శుక్రవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాకేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, మరిపెడలోని సెయింట్ ఆగస్టిన్ స్కూళ్లను సందర్శించి కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను సంబంధిత అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ముందుగా మహబూబాబాద్ పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో చేపట్టాల్సిన పనులు, పక్కనే ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో పరిశుభ్రత పనులు, గిరిజన బాలికల వసతి గృహంలోని కంప్యూటర్ హాల్‌లో ఎన్నికలకు నిబంధనల మేరకు చేట్టాల్సిన పనులను అధికారులకు సూచించారు. పనులు వేగవంతగా చేపట్టాలని రెవెన్యూ, ఇంజనీరింగ్, సర్వే అధికారులను ఆదేశించారు. అనంతరం మరిపెడ సెయింట్ ఆగస్టిన్ స్కూల్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అదనపు కలెక్టర్ డేవిడ్, మానుకోట ఆర్డీవో అలివేలు, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఎన్నికల విభాగం తహసీల్దార్‌పవన్‌కుమార్, విజయభాస్కర్, బషీర్, కృష్ణప్రసాద్, రంజిత్, సందీప్ పాల్గొన్నారు.

పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

● టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి16 : నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాతపెన్షన్ విధానాన్ని కొనసాగించాలని తెలంగాణ నాన్‌గెజిటెట్ ఆఫీసర్స్ (టీఎన్జీవోస్) యూనియన్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్ అన్నారు. దేశవ్యాప్త సార్వత్రికసమ్మెలో భాగంగా అఖిల భారత రాష్ట్ర ఉద్యోగుల జాతీయ సమాఖ్య పిలుపుమేరకు టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం మధ్యాహ్నభోజన విరామసమయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యలరైజ్ చేయడంతో పాటు ఉద్యోగుల ఇన్‌కంట్యాక్స్ పరిమితి రూ.10 లక్షలకు పెంచాలని కోరారు. అదే విధంగా ఉద్యోగులకు ఇబ్బందికరంగా మారిన 317, 142 జీవోలను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ రాష్ట్ర, జిల్లా నేతలు పమ్మి నాగబ్రహ్మచారి, రోహిత్‌కుమార్, సోమాని, వేణు, సునిల్, భాస్కర్, అజయ్, గోపి, ఏఎస్.రావు, భరత్, ముజాహిద్, మంగమ్మ, రవీందర్‌రావు, కెవీ. రాజు పాల్గొన్నారు.

●మహబూబాబాద్ మండలం వేమునూర్ పాఠశాల ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి చీకటి ఉపేందర్, మండల అధ్యక్షుడు రాచకొండ ఉపేందర్, ఉపాధ్యాయులు బానోత్‌వాగ్యా, కోడెం శ్రీనివాస్, ఎదునూరి అశోక్, ధారావత్ అశోక్, వీరన్న, జి.మంజుల పాల్గొన్నారు.

● కురవి జడ్పీహెచ్‌ఎస్ వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్. యాకూబ్, వాహిద్, రాజశేఖర్, దైద వెంకటేశ్వర్లు, శ్రీధర్, ప్రభాకర్, సురేష్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

'హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 16 : జిల్లా కేంద్రంలో ఈనెల 24 నుంచి 27 వరకు జరగనున్న టెక్నికల్ కోర్సు సర్టిఫికెట్లకు హాజరుకానున్న అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలి డీఈవో రామారావు శుక్రవారం తెలిపారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. www.bse.telangana. gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు శ్రీరాములు సెల్‌నెంబర్ : 98497 61012ను సంప్రదించాలన్నారు.

మానుకోట ఎస్డీపీవోగా తిరుపతిరావు బాధ్యతల స్వీకరణ



మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 16 : మహబూబాబాద్ సబ్‌డివిజన్ పోలీస్‌అధికారి (ఎస్డీపీవో)గా శుక్రవారం ఎస్.తిరుపతిరావు బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన తీర్థాల సత్యనారాయణ వరంగల్ ట్రాఫిక్ డీఎస్పీగా బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో సైబరాబాద్ డీఎస్పీగా పని చేసిన తిరుపతిరావును మానుకోటకు బదిలీ చేశారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన బాధ్యతలను స్వీకరించారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ జోగుల చెన్నయ్యను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

డోర్నకల్ మునిసిపల్ కమిషనర్‌గా నరేష్‌రెడ్డి



డోర్నకల్, ఫిబ్రవరి 16 : డోర్నకల్ మునిసిపల్ కమిషనర్‌గా బి.నరేష్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. భువనగిరి మునిసిపల్ మేనేజర్‌గా పనిచేసిన నరేష్‌రెడ్డి డోర్నకల్ మునిసిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నరేష్‌రెడ్డిని మునిసిపల్ ఏఈ బాబు, సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన మున్వర్‌అలీ నల్గొండ జిల్లా హలియా మునిసిపాలిటీ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు.

'ఎన్డీ దళకమాండర్లకు ప్రాణహాని తలపెట్టవద్దు'

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి16 : సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీకి చెందిన ఇద్దరు అజ్ఞాత దళకమాండర్లను గత రెండ్రోజుల క్రితం బయ్యారం పోలీసులు అరెస్టు చేశారని, వారికి ఎలాంటి ప్రాణహాని తలపెట్టకుండా కోర్టులో హాజరుపరచాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అశోక్ అలియాస్ కురుసం వజ్జయ్య, వరంగల్ జిల్లా కార్యదర్శి గోపి అలియాస్ ధనసరి సమ్మయ్యలను గత రెండ్రోజుల బయ్యారం పోలీసులు అరెస్టు చేశారని చెప్పారు.

● ఎన్డీ అజ్ఞాత దళకమాండర్లను ఈ నెల 14న బయ్యారం పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని, వారికి ప్రాణహాని తలపెట్టకుండ కోర్టులో హాజరు పరచాలని ఎన్డీ జిల్లా నాయకులు గుజ్జు దేవేందర్, బండారి ఐలయ్య అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో అక్రమ అరెస్టును ఖండించాలని నిరసన వ్యక్తం చేశారు. భట్టు చైతన్య, తాజ్‌పాషా, హలావత్ లింగయ్య, ఎస్‌కె.బాబన్న, నందగిరి వెంకటేశ్వర్లు, బాలమల్లు, నాగరాజు, సోమన్నచారి, చారీ హరీష్ పాల్గొన్నారు.

'మానుకోట డీపీఆర్వోపై చర్యలు తీసుకోవాలి'

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 16 : అక్రిడేషన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయకుండా కాలయాపన చేస్తున్న మహబూబాబాద్ జిల్లా ప్రజాసంబంధాల అధికారి (డీపీఆర్వో) శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు, టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వర్‌రావు కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో రాష్ట్ర ఐఅండ్‌పీఆర్ కమిషనర్ హన్మంతరావుకు శుక్రవారం విజ్ఞప్తి చేశారు. తనకు నచ్చిన జర్నలిస్టులకు అక్రిడేషన్‌లు ఇచ్చేలా కుట్రలుపన్నుతున్నారని ఆరోపించారు. అలాంటి అధికారిని బదిలీచేసి జర్నలిస్టుల హక్కులను కాపాడాలని కోరారు.

21 నుంచి వట్టేవాగు సమ్మక్క, సారలమ్మ జాతర



మాట్లాడుతున్న పూజారుల కమిటీ అధ్యక్షుడు దారం సిద్దు

గూడూరు, ఫిబ్రవరి 16 : మండలంలోని చింతలగట్టు వట్టేవాగు సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాలు ఈనెల 21 తేదీ నుంచి ప్రారంభమవుతాయని పూజారుల కమిటీ అధ్యక్షుడు దారం సిద్దు తెలిపారు. జాతర ప్రాంగణంలో శుక్రవారం జాతర నిర్వాహకులు, పూజారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి రోజు జగన్నాయకులగూడెం నుంచి పగిడిద్దరాజును పెనుక వంశీయులు, సారలమ్మను మట్టేవాడ నుంచి సిద్ధబోయిన వంశీయులు, గోవిందరాజును మచ్చర్ల శివారు కొమురంభీమ్‌నగర్ నుంచి సనుప వంశీయులు, నాగులమ్మను కొత్తగూడ మండలం గోపాలపురం నుంచి తుర్సా వంశీయులు, జంపన్నను బయ్యారం మండలం గురిమిల్ల నుంచి దారం వంశీయులు గద్దెలకు చేరుస్తారని చెప్పారు. 22న చింతలగట్టు శివారు సూర్యుడి గుట్ట నుంచి సమ్మక్కను దారం వంశీయులు గద్దెకు తీసుకువస్తారని పేర్కొన్నారు. 23న వన దేవతలకు భక్తులు మొక్కులు చెల్లించుట, 24న వన దేవతల వన ప్రవేశం కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఈ జాతరకు సుమారు 5 లకలకు పైగా భక్తులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో జాతర కమిటీ అధ్యక్షుడు పెనక నాగయ్య, ప్రధాన కార్యదర్శి ఈసం సహదేవులు, పూజారుల కమిటీ ప్రధాన కార్యదర్శి కారం లక్ష్మయ్య, జాతర కమిటీ ఉపాధ్యక్షులు వాసం భద్రయ్య, కోశాధికారి సనుప వీరస్వామి, జాతర నిర్వాహకులు, పూజారులు తాటి సుధాకర్, పూనెం జనార్దన్, దారం నరేష్, సిద్దబోయిన పోతయ్య, కొట్టెం వజ్జయ్య, దారం సాంబరాజు, పూనెం అశోక్, ఈసం భద్రమ్మ, బిజ్జ బుచ్చమ్మ, దారం రాము, వాసం రమేష్ పాల్గొన్నారు.

అమ్మాపురంలో ఉపాధ్యాయుల నిరసన

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 16 : దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు, రైతుల సంఘాలు శుక్రవారం నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెకు మద్దతుగా ఉపాధ్యాయులు మద్దతు తెలిపారు. ఈ మేరకు తొర్రూరు మండలం అమ్మాపురం ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలతో కార్మికులు, రైతులు, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ), టీఎస్‌యూటీఎఫ్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి నాగమల్లయ్య, వీరన్న, ఉపాధ్యాయులు మంజుల, రజియాబేగం, సరిత, కల్యాణి, వెంకన్న, హరికృష్ణచారి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్‌కు కంప్యూటర్ల బహూకరణ

డోర్నకల్, ఫిబ్రవరి 16 : మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌కు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎ్‌సఆర్) ఫండ్ ద్వారా 5కంప్యూటర్‌లను శుక్రవారం డోర్నకల్ బ్రాంచ్ మేనేజర్ కుమారస్వామి చేతుల మీదుగా పాఠశాలకు బహూకరించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ సీఎస్‌ఆర్ నిధి ద్వారా తెలంగాణ రాష్ట్రంలో ఎంపిక చేసినరెండు స్కూళ్లలో డోర్నకల్ జడ్పీ హైస్కూల్ ఒకటి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేదవిద్యార్థులకు డిజిటల్ ఎడ్యుకేషన్ అందించాలనే ఉద్దేశంతోనే కంప్యూటర్‌లను బహూకరించినట్లు తెలిపారు. సుమారు రూ.5 లక్షల విలువ చేసే కంప్యూటర్‌లను బహూకరించిన ఎస్బీఐ ఉన్నతాధికారులకు జడ్పీహైస్కూల్ హెచ్‌ఎం నర్సింహారావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పిరెడ్డి, శ్రీనివాస్, మంజులత, రమేష్, రాంనాయక్, సురేష్‌బాబు, పరమేష్, ఫహీమ్, అమీనా, వసంతరాణి, దమయంతి, కృపాకాంత, కమల, బిచ్చానాయక్, భవాని, జహేదబేగం, ఉపేంద్ర, అచ్చమ్మ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ

● ఫిట్స్ వచ్చిన బాలికను పోలీసు వాహనంలో ఆసుపత్రికి తరలింపు



బాలికను పోలీసు వాహనంలో ఎక్కిస్తున్న దృశ్యం

నర్సింహులపేట, ఫిబ్రవరి 16 : ఓ బాలికకు ఫిట్స్‌వచ్చి, అపస్మారక స్థితికి చేరుకోవడంతో అటువైపుగా వెళ్లిన నర్సింహులపేట ఎస్సై బాలికను అక్కున చేర్చుకొని, తక్షణ వైద్యం కోసం తన పోలీసు వాహనంలో ఆస్పత్రికి తరలించి శుక్రవారం మానవత్వాన్ని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళ్లితే. మరిపెడ మండలం గుండెపూడు గ్రామానికి చెందిన స్వాతి-ప్రభాకర్ దంపతుల నాలుగేళ్ల కూతురు భానుశ్రీ తనతల్లి స్వాతితో నర్సింహులపేట మండలంలోని పడమటిగూడెం గ్రామంలో అమ్మమ్మ బొబ్బలి లింగమ్మ ఇంటికి రెండురోజుల క్రితం వచ్చారు. అప్పటికే జ్వరంతో ఉన్న భానుశ్రీకి శుక్రవారం మధ్యాహ్నం ఫిట్స్ వచ్చాయి. గమనించిన కుటుంబ సభ్యులు తొర్రూరు ఆస్పత్రికి తరలించేందుకు ఖమ్మం-వరంగల్ ప్రధాన రహదారి పడమటిగూడెం స్టేజీ వద్దకు తీసుకెళ్లారు. స్టేజీ వద్ద జనం గుమ్మికూడి ఉండడాన్ని తొర్రూరు నుంచి నర్సింహులపేటకు వస్తున్న ఎస్సై సతీష్ గమనించి, వాహనాన్ని ఆపి, విషయం తెలుసుకున్నాడు. చలించిన ఎస్సై పోలీసు వాహనంలో భానుశ్రీని ఎక్కించి తొర్రూరు ఆస్పత్రికి తరలించాడు. వేరొకరి ద్విచక్రవాహనంపై ఎస్సై సతీష్ నర్సింహులపేట పోలీసుస్టేషన్‌కు చేరుకున్నాడు. ఎస్సై సహకారానికి కుటుంబ సభ్యులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, ఆస్పత్రికి తరలించిన భానుశ్రీకి ఎలాంటి ప్రమాదంలేదని వైద్యులు తెలిపారు.

భారత్ బంద్ విజయవంతం

(3వ పేజీ తరువాయి)

వెంకటస్వామి, బాలునాయక్, విజయలక్ష్మి, రాందాసు, బోనగిరి గిరిధర్‌గుప్తా, చిట్టోజు రవీంద్రా చారి పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థలను బంద్ చేయించారు. జిల్లా కార్యదర్శి కేలోతు సాయికుమార్, డివిజన్ కార్యదర్శి గుగులోతు సూర్య పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

కేసముద్రంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఇఫ్టూ, బహుజన కార్మిక సంఘాల జేఏసీ,సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో వేర్వేరుగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, కార్మిక సంఘాల నాయకులు శివ్వారపు శ్రీధర్, కంచ వెంకన్న, జన్ను రమేష్, కన్నంతరెడ్డి భాస్కర్‌రెడ్డి, బొమ్మగాని ఎల్లయ్య పాల్గొన్నారు.

● మరిపెడలో ఆల్ ట్రేడ్ యూనియన్స్ గ్రామీణ బంద్ నిర్వహించారు. అంగన్‌వాడీ, ఆశా, మునిసిపల్, జీపీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లు అసంఘటిత కార్మికులు పాల్గొని, పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఆయా సంఘాల బాధ్యులు అల్వాల వీరన్న, దుండి వీరన్న, మారగాని బాలకృష్ణ, అబ్దుల్ రషీద్, కొండ ఉప్పలయ్య, జిన్న లచ్చన్న, బెస్త సంపూర్ణ, జ్యోతి, పుష్పాంజలి, ఆసియా, సునీత పాల్గొన్నారు.

● దంతాలపల్లిలో కార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి అంబేద్కర్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. గునిగంటి మోహన్, భవాణిశ్రీను, ఉడుగుల లింగన్న, వీరభద్రం, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

● నర్సింహులపేటలో కాంగ్రెస్, కేవీపీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు, టీచర్లు, ఆశావర్కర్లు, తాపీమేస్త్రీలు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు చిర్ర సతీష్, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మందుల యాకూబ్ పాల్గొన్నారు.

● గూడూరులో కాంగ్రెస్, ఎంసీపీఐ (యూ), సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, ఎన్డీ, సీఐటీయూ,అంగన్‌వాడీ టీచర్స్‌అండ్‌వర్కర్స్ యూనియన్ నాయకులు చిట్టి వెంకటేశ్వర్లు, నూకల ఉపేందర్, శ్రీపాల్‌రెడ్డి, చంటిస్వామి, వీరస్వామి, భరత్, రాజమౌళి, తిరుపతమ్మ, మల్లేష్ పాల్గొన్నారు.

● తొర్రూరులో వామపక్ష, కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో భారీ ధర్నా, ర్యాలీ, రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిటీ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, సీపీఎం జిల్లా నాయకులు బొల్లం అశోక్, ఎం.వీరన్న, సాయిలు, కొత్తపల్లి రవి, యాకూబ్, శ్రీను, హరీష్, సోమిరెడ్డి, సాయిమల్లు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

● గార్ల మండల కేంద్రంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూసెంటర్‌లో కార్మికులు మానవహారం నిర్వహించగా కందునూరి శ్రీనివాస్, కట్టెబోయిన శ్రీనివాస్, జి.సక్రు, జడ సత్యనారాయణ, జం పాల వెంకన్న, వంగూరి వెంకటేశ్వర్లు, పందుల రమాదేవి పాల్గొన్నారు.

● బయ్యారంలో వివిధ పార్టీలకు చెందిన అఖిలపక్ష నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాంమ్మూర్తి, రవినాయక్, రాజన్న,ఐలయ్య, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, బిక్షం, సూరి, యాకయ్య, శ్రీను, మోహన్ పాల్గొన్నారు.

● డోర్నకల్‌లో కాంగ్రెస్, సీపీఎం, బీఎస్పీ, ఎన్డీ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించగా ఆయా పార్టీల నాయకులు ఉప్పనపల్లి శ్రీనివాస్, బొమ్మన అశోక్‌కుమార్, పుట్ట శ్రీనివాస్, సుమీర్‌చంద్ జైన్, సాదనాల వెంకటేశ్వర్లు, మామిడి నాగరాజు, ఖాదర్‌బాబా, విజయ్‌కాంత్, యాస వెంకటనారాయణ, భాస్కర్ పాల్గొన్నారు.

● కొత్తగూడలో ఎన్డీ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఎన్డీ నాయకులు పాల్గొన్నారు.

● నెల్లికుదురులో సీఐటీయూ మండల కార్యదర్శి ఈసంపెల్లి సైదులు, బాబుగౌడ్, వరిపెల్లి వెంకన్న, చిర్ర సత్యనారాయణ, ఆలకుంట్ల సాయిలు, ఇరుగు అనిల్, చిర్ర లక్ష్మీనర్సమ్మ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

● పెద్దవంగరలో అంబేద్కర్ చౌరస్తాలో సీపీఐ, సీఐటీయూ, కార్మిక సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించారు. వీరన్న, యాకమల్లు, దేవేందర్, యాకన్న, శంకర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● కురవిలో సీపీఎం, సీపీఐ, సీపీఐ (ఎంఎల్), ప్రజాసంఘాలు, సీఐటీయూ, అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, జీపీ వర్కర్ల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. నల్లు సుధాకర్‌రెడ్డి, మలేడి కోటయ్య, సామ పాపయ్య, పోతుగంటి మల్లయ్య, నల్లపు సుధాకర్, సరోజ, గంధసిరి జ్యోతిబసు, తురక రమేష్, కట్ల కృష్ణ, పోలెపాక వెంకన్న, బుర్ర సమ్మయ్య, కలగూర నాగరాజు, చెలగోల మల్లయ్య పాల్గొన్నారు. యూ ఎస్‌పీసీ ఆధ్వర్యంలో కురవి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల భోజన విరామ సమయంలో బంద్ సంఘీభావంగా నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో షేక్.యాకూబ్, ఎండి.వహీద్, కె.రాజశేఖర్, దైద వెంకటేశ్వర్లు, శ్రీధర్, వెంకన్న, ప్రభాకర్, సురేష్ పాల్గొన్నారు.



తొర్రూరు బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులు

నేడు ఇంటర్ విద్యార్థులకు 'మానవతా విలువలు' పరీక్ష

● డీఐఈవో సత్యనారాయణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి16 : జిల్లాలో గతంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం 'మానవతా విలువలు ఎథిక్స్' పరీక్ష రాయనటువంటి విద్యార్థులు ఈనెల 17న నిర్వహించే పరీక్ష తప్పనిసరిగా రాయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. జిల్లాలో 47 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, వారిలో జనరల్ విద్యార్థులు 27 మంది, వొకేషనల్ విద్యార్థులు 20 మంది ఉన్నారని తెలిపారు. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 12 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 9గంటలకు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించి పరీక్షకు హాజరు కావాలని సూచించారు. ఈ పరీక్షకు హాజరైన విద్యార్థులు మాత్రమే పైచదువులకు అర్హులని తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అభిలాష్



ఇనుగుర్తి, ఫిబ్రవరి 16 : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఇనుగుర్తి పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి బోళ్ల అశోక్ ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కొమ్ము రాజేందర్, ప్రధానోపాధ్యాయుడు రూపారాణి శుక్రవారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లికుదురు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన అభిలాష్‌ను ఈ నెల 17 నుంచి 19 వరకు సూర్యాపేట జిల్లా కోదాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు పాఠశాల ఉపాధ్యాయులు అభిలాష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాకయ్య, నారాయణ, యాదగిరి, ప్రవీన్, దేవేందర్, కిషన్, సమ్మిరెడ్డి, కుమారస్వామి, శిరీష పాల్గొన్నారు.

'ఎన్డీ నాయకుల అరెస్ట్‌ను చూపాలి'

కేసముద్రం, ఫిబ్రవరి16 : సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్, వరంగల్ జిల్లా కార్యదర్శి గోపన్న, పుల్లన్నను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, వారిని వెంటనే కోర్టులో హాజరుపర్చాలని ఆ పార్టీ కేసముద్రం, తొర్రూరు మండలాల కార్యదర్శి శివారపు శ్రీధర్ డిమాండ్ చేశారు. కేసముద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూవీరితోపాటు మదార్, సురేష్, ఖమ్మం జిల్లా నాయకులు పుల్లన్నలను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వారికి ఎలాంటి హాని తలపెట్టకుండా కోర్టులో హాజరుపర్చాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ దీపాదాస్‌ను కలిసిన వెంకన్న

గూడూరు, ఫిబ్రవరి16 :తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, రాష్ట్రప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డిను శుక్రవారం హైదరాబాద్‌లో ఎట్టి వెంకన్న మర్యాదపూర్వకంగా కలిశారు. గాంధీ భవన్‌లో ఇరువురిని వేర్వేరుగా కలిసి తన ప్రొఫైల్‌ను అందజేశారు. మహబూ బాబాద్ పార్లమెంట్ స్థానం ఎస్టీ రిజర్వుడ్ అని, 2009నుంచి ఆదివాసీలకు టికెట్ కేటాయించలేదని గుర్తు చేశారు. ఈసారైనా మహబూబాబాద్ పార్లమెంట్ ఎంపీ టికెట్‌ను తనకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 16 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా ప్రతీ ఒక్కరు ఫ్రైడేను డ్రైడేగా నిర్వహించుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అంబరీష అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్లో శుక్రవారం ఆరోగ్య కార్యకర్తలకు కీటకజనీత వ్యాధుల నివారణపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబరీష మాట్లాడుతూ జిల్లాలో కీటక జనీత సంబంధిత వ్యాధులను అరికట్టేందుకుప్రతీ శుక్రవారం ఫ్రైడేను డ్రైడేగా నిర్వహించుకోవాలని చెప్పారు. వైద్యాధికారులు సుధీర్‌రెడ్డి, విజయ్‌కుమార్, నాగేశ్వర్‌రావు, రాంబాబు, శ్రావణ్, కృష్ణార్జున్‌రావు, వడ్డెబోయిన శ్రీనివాస్, గోపిచంద్, కేవీ.రాజు, పురుషోత్తం, ఫైముద్దీన్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం : కేసు నమోదు

గార్ల, ఫిబ్రవరి 16 : ముల్కనూరు పంచాయతీ చంద్రగిరికు చెందిన బాలిక (17) అదృశ్య మైంది. తల్లిదండ్రులు బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేక పోవడంతో పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఎస్సై జీనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. చంద్రగిరికి చెందిన గంగావత్ లక్ష్మీత్రివేణి గార్లలోని పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఈనెల 14న ఇంటిముందు పడుకొని ఉండగా, తెల్లవారుజామున కుటుంబసభ్యులు లేచిచూసే సరికి కనిపించ లేదు. చుట్టుపక్కల బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకి లభించక పోవడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తండ్రి గంగావత్ మల్సూర్ ఫిర్యాదు మేరకు ఎస్సై జీనత్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తొర్రూరు డీఎస్పీగా సురేష్

తొర్రూర్, ఫిబ్రవరి 16 : తొర్రూరు డీఎస్పీగా వి.సురేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన జి.వెంకటేశ్వరబాబు డీజీపీ కార్యాలయానికి అటాచ్ కావడంతో, జగిత్యాల జిల్లా డీసీఆర్బీలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న వి.సురేష్ బాధ్యతలు చేపట్టారు.

'ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి'



పెద్దవంగర : లాఅండ్ ఆర్డర్‌తో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డీఎస్పీ సురేష్ అన్నారు. పెద్దవంగరలోని పోలీస్‌స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ పరిసరాలను, పలు రికార్డులను పరిశీలించి, పెడింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఎస్సై రాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతనంగా బాధ్యతులు స్వీకరించిన డీఎస్పీని బీఆర్ఎస్ నాయ కులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఎస్సై కుమారస్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య ఎంపీటీసీ రవీందర్, శ్రీరాంసంజయ్, శ్రీరాం రాము, లింగమూర్తి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

4న మానుకోట మునిసిపల్ వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి16 : మానుకోట మునిసిపల్ వైస్‌చైర్మన్ ఎమ్డీ. ఫరీద్‌పై మార్చి 4న మధ్యాహ్నం 3గంటలకు అవిశ్వాసంపై కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ నిర్ణయించారు. ఈ మేరకు వార్డు కౌన్సిలర్లకు సమాచారం అందించారు. ఈనెల 12న మహబూబాబాద్ మునిసిపాలిటీవైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం పెడుతూ 29 మంది వార్డు కౌన్సిలర్లు సంతకాలు చేసిన తీర్మాణ నోటీసును కలెక్టర్‌కు అందజేశారు. పరిశీలన అనంతరం వచ్చేనెల 4న అవిశ్వాసంపై మునిసిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ నిర్ణయించారు.